# ఎన్‌సీసీ కోటా సీట్ల భర్తీకి ఇంటరే అర్హత పరీక్ష

- ఎంసెట్ అర్హత పరీక్షన్న అధికారుల భాష్యం సరికాదు
- స్పష్టం చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఎన్‌సీసీ కోటా కింద భర్తీ చేసే ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల సీట్లకు సంబంధించి 'అర్హత పరీక్ష' ఇంటర్మీడియటే తప్ప, ఎంసెట్ ప్రవేశ పరీక్ష కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ వైద్యశాఖ అధికారులు చెప్పిన భాష్యం ఎంతమాత్రం సరికాదంది. ఎన్‌సీసీ కోటా కింద భర్తీ సీట్లకు ఇంటరే అర్హత పరీక్ష అవుతుందని తేల్చిచెప్పింది. ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ అనిస్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఎన్‌సీసీ కోటా కింద భర్తీ చేసే ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల విషయంలో ఎంసెట్‌ను అర్హత పరీక్షగా పేర్కొనడాన్ని సవాలుచేస్తూ నెల్లూరు జిల్లాకు చెందిన విద్యార్థిని ఆర్.జోత్స్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న ధర్మాసనం అర్హత పరీక్షకు అధికారులు చెప్పిన భాష్యాన్ని తప్పుపట్టింది. ఎంసెట్ కేవలం పోటీ పరీక్ష మాత్రమేనని, అర్హత పరీక్ష మాత్రం ఇంటరేనని స్పష్టం చేసింది. ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, మెడికల్, డెంటల్ కోర్సుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిబంధనల్లో ఇంటర్‌ను అర్హత పరీక్షగా పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. ఇంటర్ పరీక్షకు హాజరు కావడానికి ముందు ఎన్‌సీసీ సీ, బీ, ఏ సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులకే సీట్ల భర్తీలో ప్రాధాన్యతనివ్వాలే తప్ప, ఎంసెట్ పరీక్షకు ముందు సర్టిఫికెట్లు సాధించిన వారికి కాదని తేల్చిచెప్పింది.